క్లుప్తంగా

నూతన దంపతులకు ఎమ్మెల్యే అన్నా ఆశీర్వాదం


నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

బేస్తవారిపేట: స్థానిక త్రిలోక పుణ్యక్షేత్రంలోని కల్యాణ మండపంలో శనివారం గణిత ఉపాధ్యాయుడు దేశిరెడ్డి రఘునాథరెడ్డి, విజయలక్ష్మి దంపతుల కుమార్తె, సలకలవీడు సచివాలయ ఉద్యోగి శిరీషా, దిలీప్‌కుమార్‌రెడ్డిల వివాహ రిసెప్షన్‌కు ఎమ్మెల్యే అన్నా రాంబాబు హాజరయ్యారు. నూతన దంపతులను ఆశీర్వదించారు. ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయితీపై పండ్ల మొక్కల పంపిణీ

పొన్నలూరు: మండలంలో ఆసక్తి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు నూరు శాతం రాయితీపై ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు ఏపీఓ మాచర్ల తెలిపారు. ఐదు ఎకరాల లోపు పొలం ఉన్న రైతులకు నిమ్మ, మామిడి, సపోటా, బత్తాయి, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, తైవాన్ జామ, జామ, గులాబీ, మల్లె, సీతాఫలం, యాపిల్‌బేర్, దానిమ్మ, నేరేడు, మునగ వంటి పండ్ల మొక్కలను రాయితీపై అందజేస్తారన్నారు. రైతులు గ్రామాల్లోని ఉపాధి హామీ సిబ్బంది వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

తహసీల్దార్ నాగూల్‌మీరా బదిలీ

కురిచేడు: స్థానికంగా తహసీల్దార్‌గా పనిచేస్తున్న షేక్ నాగూల్‌మీరా వెలిగండ్లకు బదిలీ చేస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు అందాయి. పామూరు తహసీల్దార్ మిడసల జ్వాలా నరసింహాన్ని నాగూల్‌మీరా స్థానంలో నియమించినట్లు ఉత్తర్వులు వచ్చాయి. గడిచిన నాలుగేళ్లలో ఆరుగురు తహసీల్దార్‌లు బదిలీ కావడం గమనార్హం.

దర్శి తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు

దర్శి: దర్శి తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లును నియమిస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. దొనకొండ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లును దర్శి తహసీల్దార్‌గా నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రావణ్‌కుమార్‌ను కంభం బదిలీ చేశారు.

గిద్దలూరు ఎంపీడీఓగా హేమలత


హేమలత


గిద్దలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఉద్యోగుల బదిలీల్లో గిద్దలూరు ఎంపీడీఓగా హేమలతను నియమించారు. ఆమె చిలకలూరిపేటలో ఈఓఆర్డీగా పనిచేస్తూ పదోన్నతి పొంది గిద్దలూరు ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న రంగనాయకులు ఎంపీడీఓగా పదోన్నతి పొంది వినుకొండ వద్ద ఈపూరు మండలానికి బదిలీ అయ్యారు.

వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై శిక్షణ


రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త

దర్శి: నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై వాటర్‌షెడ్ రైతులకు ఆరు రోజులుగా తలమళ్లలో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ ముగింపు సందర్భంగా శనివారం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎస్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. శిక్షణలో శాస్త్రవేత్తలు మెట్ట సాగులో మెళకువలు, నేల ఆరోగ్యం, నేల సంరక్షణ, నీటి వినియోగం, ఉద్యాన పంటలో సస్యరక్షణ చర్యలు, మట్టి నమూనా ఆవశ్యకత, పశుపోషణ, గొర్రెల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.ఉష, ఎం. జాహ్నవి, శివ, టీవీ రెడ్డి, ఆర్.కాశీవిశ్వనాథ్, వాటర్‌షెడ్ సిబ్బంది, ఆర్‌బీకే వీఏఏ అమూల్య, సర్పంచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ భారత్


కళాశాలను శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

దరిశి: జీ20 జన్‌బాగీదారి పీపుల్ పార్టిసిపేషన్ ఈవెంట్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో శనివారం స్కిల్ హబ్ స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. మన చుట్టూ ఉండే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భావితరాలకు సుచీ,శుభ్రతలను నేర్పాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. ఏపీఎస్‌ఎస్‌డీసీ నైపుణ్యాభివృద్ధి ఉద్యోగి, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ జె.సురేష్, ఏపీఎస్‌ఎస్‌డీసీ నాగేశ్వరరావు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో వైద్య విప్లవం

- ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్ సేవలు
- గ్రామాల్లోనే అందుబాటులో 67 రకాల మందులు


ఇంటి వద్దే వృద్ధుడిని పరీక్షిస్తున్న డాక్టర్ సింధూజ

తర్లుపాడు: టీడీపీ ప్రభుత్వంలో నాడి పట్టడానికి వైద్యుడు లేక, మందు బిల్లలకు దిక్కులేక నిర్లక్ష్యానికి గురైన వైద్యారోగ్య శాఖకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చికిత్స చేశారు. ప్రస్తుతం రోగుల ఇంటి వద్దకే వచ్చి డాక్టర్లు సేవలందిస్తున్నారు. నాడు నేడు కార్యక్రమంలో వైద్యశాలల రూపురేఖలు మారిపోతున్నాయి. హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ ద్వారా వస్తున్న నిధులతో వైద్యశాలల మరమ్మతులతోపాటు అత్యవసర మందులు కూడా కొనుగోలు చేస్తున్నారు. మండల కేంద్రమైన తర్లుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొత్తం 8 సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటి ద్వారా మండలంలో సుమారు 35 వేల మందికి పైగా ప్రజలు సేవలు పొందుతున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నూతనంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ రోగులు సత్వర సేవలు పొందుతున్నారు. గతంలో వైద్యశాలకు వచ్చినా డాక్టర్లు, మందులు లేక ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఉండేది, ఇప్పుడు సీన్ మారింది.

సబ్ సెంటర్ల ద్వారా వైద్యం

తర్లుపాడు మండల పరిధిలో తుమ్మలచెరువు, కలుజువ్వలపాడు, మీర్జాపేట, తాడివారిపల్లి, చెన్నారెడ్డిపల్లె, సీతనాగులవరం, నాగెళ్ళముడుపు, తర్లుపాడు తదితర సెంటర్ల ద్వారా ఏయన్‌ఎంలు, ఆషా కార్యకర్తలు, సూపర్వైజర్లు గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై, వ్యక్తిగత పరిశుభ్రత, డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించేలా ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

డాక్టరమ్మ బాగా చూస్తుందయ్యా


దిబ్బమ్మ

ఈమె పేరు దిబ్బమ్మ. వయస్సు 66 ఏళ్లు. స్వగ్రామం నాగెళ్లముడుపు. వేసవి కాలం కావడంతో ఇటీవల జ్వరం బారిన పడింది. ఏఎన్‌ఎం సూచన మేరకు తర్లుపాడు పీహెచ్‌సీ డాక్టర్ వద్దకు వెళ్లింది. ఆమెకు అన్ని రకాల పరీక్షలు చేసిన డాక్టర్.. అవసరమైన మందులిచ్చి పంపారు. అధైర్యపడవద్దని చెప్తూ మానసిక ధైర్యం కల్పించడంతో మందులు తీసుకుని కృతజ్ఞతలు తెలిపింది.

మందులిచ్చారయ్యా


రత్తయ్య

ఈయన పేరు రత్తయ్య, వయస్సు 55, గ్రామం తాడివారిపల్లి. ఇటీవల తీవ్రమైన ఎండలకు జ్వరంతోపాటు బాగా నీరసం రావడంతో శనివారం తర్లుపాడులోని వైద్యశాలకు వచ్చాడు. డాక్టర్ సింధూజా పరీక్షించి సాధరణ జ్వరమేనని చెప్పి మందులిచ్చి పంపింది. దీంతో పాటు ఓఆర్‌ఎస్ తాగాలని ఎండకు బయట తిరగొద్దని సూచనలు చేసి పంపింది. ప్రస్తుతం ఈయన ఆరోగ్యంగా ఉన్నారు.

అందుబాటులో వైద్య సేవలు



తర్లుపాడు పీహెచ్‌సీ పరిధిలో ప్రజలకు అన్నివేళలా సేవలందిస్తున్నాం. వైద్యశాలలో 67 రకాల మందులు, 14 రకాల డయాగ్నోస్టిక్స్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు వెళ్లి వృద్ధులు, మహిళలకు సేవలందిస్తున్నాం. ప్రతి రోజూ 70 నుంచి 80 మంది రోగులు వైద్యశాలకు వస్తున్నారు. వీరికి చికిత్స అందించడంతో పాటు నెలకు దాదాపు 15 కాన్పులు చేస్తున్నాం.

– డాక్టర్ సింధూజ, తర్లుపాడు, పీహెచ్‌సీ వైద్యాధికారి

జగనన్న ఆణిముత్యం భువనేశ్వరి


విద్యార్థిని తల్లిదండ్రులను సన్మానిస్తున్న నిర్వాహకులు

పొదిలి: ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో 571 మార్కులు పొందిన చీతిరాల భువనేశ్వరి అందరికీ ఆదర్శంగా నిలిచిందని డీవైఈఓ చంద్రమౌళీశ్వరరావు కొనియాడారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో భువనేశ్వరికి లాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానంతో పాటు, రూ.10 వేల నగదు ప్రోత్సాహకం అందజేశారు. విద్యను ప్రోత్సహిస్తున్న ఫౌండేషన్ సేవలను కొనియాడారు. ఫౌండేషన్ చైర్మన్ ఆకిబ్ అహ్మద్ మాట్లాడుతూ.. ఏటా అధిక మార్కులు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు చెప్పారు. భువనేశ్వరి తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, మర్రిపూడి ఎంఈఓ ఇ.రంగయ్య, బీవీ రెడ్డి, మేనేజర్ షేక్.షర్మిల తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామశాలకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కృష్ణ

మార్కాపురం: కేపీ కొండారెడ్డి వ్యాయామశాల భవనానికి శనివారం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ శంకుస్థాపన చేశారు. స్థానిక పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్ సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ క్రీడా వికాస కేంద్రం పడమర వైపు ఉన్న స్థలాన్ని వ్యాయామశాల కోసం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కేటాయించారు. దాతల సహకారంతో వ్యాయామశాల నిర్మిస్తున్నట్లు జిల్లా బాక్సింగ్ కోచ్ వేణు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, 11వ వార్డు ఇన్చార్జి ఉత్తమ్ కుమార్, కోడి రామమూర్తి క్రీడా సాంస్కృతిక సేవ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పిన్నిక నాగేశ్వరరావు, కాలగంటి శ్రీనివాసులు, గంగిశెట్టి కిరణ్‌కుమార్, కాంట్రాక్టర్ బి.వెంకటేశ్వరరెడ్డి, కోచ్‌లు రాంబాబు, మహేష్, సుబ్బారావు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

స్వీట్ షాప్‌ల తనిఖీ


తనిఖీ చేస్తున్న రసూల్

మార్కాపురం టౌన్: పట్టణంలోని బేకరి, స్వీట్ షాప్‌లను శనివారం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రసూల్ తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొన్ని షాపుల్లో దుర్వాసన వస్తున్న పదార్థాలు, స్వీట్లను గుర్తించి సీజ్ చేయడంతోపాటు యజమానులను హెచ్చరించారు. నాణ్యమైన ఉత్పత్తులు విక్రయించాలని, ట్రేడ్ లైసెన్స్ లేనివారు సచివాలయంలో శానిటరీ సెక్రటరీని సంప్రదించి తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు జూట్ సంచులు వాడాలని సూచించారు.

పిచ్చికుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

పొదిలి: పిచ్చికుక్కలు దాడి చేయడంతో ఇద్దరు గాయపడిన సంఘటన శనివారం తాలూకా ఆఫీసు వీధిలో చోటుచేసుకుంది. గుంపుగా వచ్చిన కుక్కలు వీధిలో ఆడుకుంటున్న బాలుడిపై దాడి చేశాయి. అనంతరం ఓ మహిళను వెంబడించి గాయపరిచాయి. క్షతగాత్రులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేరి చికిత్స పొందారు. మున్సిపల్ అధికారులు స్పందించి వీధికుక్కల బెడద తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.

జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా శ్రీవిద్య, చండి హోమాలు


హోమానికి హాజరైన భక్తులు

మార్కాపురం: పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా స్వామివారికి, అమ్మవారికి శ్రీ విద్య, చండి హోమాలను నిర్వహించారు. స్వామివారికి, అమ్మవార్లకు చక్ర నవావరణ అర్చన, కుంకుమార్చన చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కేశవరావు ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ఎస్‌జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు వి.శ్రీనివాసుతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

రైతులకు నవధాన్యాల కిట్ల పంపిణీ


విత్తన కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు

పొదిలి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో రైతులకు నవధాన్యాల విత్తనాల కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ.. పచ్చిరొట్ట పంటలుగా వేసుకునేందుకు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువుల ద్వారా భూమికి, పంటలకు కలిగే ప్రయోజనాలను గురించి వివరించారు. 23 రకాల విత్తనాలను కలిగిన కిట్లను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేలం అధికారి గిరిరాజ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ జి.రవిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్‌కే అక్రమ్, రైతు సంఘం నాయకులు అవులూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెలుగొండ క్షేత్రంలో శ్రీవారికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో వెలుగొండ శ్రీవారు

కొనకనమిట్ల: ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వర స్వామి వారిని అర్చకుడు ప్రసాదాచార్యులు పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఏర్పాట్లను ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి పర్యవేక్షించారు. అలాగే వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు, అభయాంజనేయస్వామికి పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారిని అర్చకుడు విజయకాంత్‌శర్మ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

పెన్షన్‌దారులు ఈకేవైసీ చేయాలి

తాళ్లూరు: పెన్షన్‌దారుల కోసం ఈకేవైసీ కౌంటర్లు ఆదివారం కూడా తెరిచి ఉంటాయని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆ సంఘ జిల్లా సంయుక్త కార్యదర్శి ఐ.వెంకటరెడ్డి, ఎస్.అంజిరెడ్డిలు తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నేటి నుంచి యోగాపై శిక్షణ తరగతులు

తాళ్లూరు: స్థానిక పోలీసు స్టేషన్ ఎదురుగా విద్యానికేతన్ స్కూల్లో ఆదివారం యోగా శిక్షణ ఉంటుందని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు తెలిపారు. శ్రీరామ్ గురూజీ పాల్గొని శిక్షణ ఇస్తారని చెప్పారు. ఈ నెల 15 వరకు శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు.

వధూవరులకు వెంకాయమ్మ ఆశీర్వాదం


వధూవరులను ఆశీర్వదిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: మండలంలోని పాపిరెడ్డిపాలెంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త వర్రా వెంకటేశ్వరరెడ్డి కుమారుని వివాహానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ శాసనసభ్యుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు శనివారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

లక్కవరం (తాళ్లూరు): లక్కవరం మాజీ సర్పంచి తూము ఇందిరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు శివశంకర్‌రెడ్డి కుమారుడు రాకేష్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిలు ఆశీర్వాదం అందించారు. లక్కవరంలో రాకేష్ వివాహానికి శనివారం హాజరై నూతన వధూవరులు రాకేష్‌రెడ్డి,అశ్వినిరెడ్డిలకు దీవెనలు అందించారు. మాజీ ఎంపీపీలు పోశం మధుసూదనరెడ్డి, గోళ్లపాటి మోషే, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి ఉన్నారు.

17 నుంచి సమ్మెలోకి పారిశుధ్య కార్మికులు

పొదిలి: నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఈ నెల 17 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ చెప్పారు. శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. రమేష్ మాట్లాడుతూ నగర పంచాయతీగా మారి 29 నెలలు గడిచినా కార్మికులకు అందాల్సిన బెనిఫిట్స్ అందలేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 17వ తేదీ నుంచి విధులు బహిష్కరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డి.సుబ్బయ్య, జి.నాగులు, కేవీ నరసింహం, బి.కోటేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్ట

అర్ధవీడు (కంభం): చింతమల్లెలపాడులో రాముల వారి ఆలయ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మనోజ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కామూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. జెడ్పీటీసీ చెన్ను విజయమ్మ, ఎంపీటీసీ అనంతరావు, సర్పంచి హైమావతి, నాయకులు పాల్గొన్నారు.

ఒడిశా రైలు దుర్ఘటనపై హెల్ప్‌లైన్ ఏర్పాటు

మార్కాపురం: ఒడిశాలో ఘోర రైలు ప్రమాదానికి సంబంధించి మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు సబ్ కలెక్టర్ సేథు మాధవన్ తెలిపారు. ఈ ప్రమాదంలో మార్కాపురం ప్రాంత ప్రజలు ఎవరైనా ఉంటే వారికి సహాయ సహకారాలు అందించడానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 24 గంటలు అందుబాటులో ఉంటామని తెలిపారు. అంసరమైన వారు కంట్రోల్ రూమ్ నం.88866 16066ను సంప్రదించాలని సూచించారు.

ఆలయ భూములకు కౌలు ఆదాయం రూ.7.68 లక్షలు

తాళ్లూరు: బొద్దికూరపాడులో మాధవస్వామి, సోమేశ్వర స్వామి ఆలయ భూముల కౌలు సాగుకు శనివారం వేలం పాట నిర్వహించారు. మాధవ స్వామి దేవస్థానానికి సంబంధించి 46.47 ఎకరాలకు రూ. 4.13 లక్షలు, సోమేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి 43.93 ఎకరాలకు రూ.3.55 లక్షలకు కౌలు పాటను రైతులు పాడుకున్నారు. ఈఓ భాస్కర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ పులి అంజిరెడ్డి, సర్పంచి శ్యామ్సన్, ఉప సర్పంచి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాధికారక క్రిములను ఎదుర్కోవాలి

యర్రగొండపాలెం: వ్యాధి కారక క్రిములను ఎదుర్కొనేందుకు వైద్యశాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని షేర్ ఇండియా రాష్ట్ర అధికారి డాక్టర్ నీరద అన్నారు. శనివారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కరోనా, టీబీ, ల్యాబ్, డెలివరీ రూం, ఆపరేషన్ థియేటర్, వార్డ్ రూం, బయో మెడికల్ వేస్టేజ్‌లపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మైక్రో బయోలిస్ట్ డాక్టర్ సందీప్, టీబీ అధికారి డాక్టర్ సురేష్, సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే అన్నా శంకుస్థాపన


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధి అర్బన్ కాలనీలో స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు శనివారం సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధి కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నామన్నారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, కమిషనర్ వై.రామకృష్ణయ్య, జెడ్పీటీసీ బుడతా మధుసూదన్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వలి, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ముద్దర్ల శ్రీను, ఈశ్వర్‌నాయుడు, శ్రీను పాల్గొన్నారు.

సమష్టి కృషితో మండలాభివృద్ధి


మాట్లాడుతున్న ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య

పెద్దారవీడు: మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పని చేసినప్పుడే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరు కాకపోవడంతో తాము సమస్యలు ఎవరికి విన్నవించాలంటూ అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్యాలయంలో నిధులు దుర్వినియోగం చేశారని వైస్ ఎంపీపీ గుండారెడ్డి యోగమ్మ ఆరోపించారు. రామాయపాలెంలో వాహనం ద్వారా బియ్యం ఇంటింటికీ పంపిణీ చేయడం లేదని సర్పంచ్ పొందుగుల వెంకటరెడ్డి మండిపడ్డారు. మార్కాపురం నుంచి సానికవరం, రామాయపాలెం మీదుగా దోర్నాలకు, బద్వీడు, చట్లమిట్ల, వైడీపాడు గ్రామాల మీదుగా గంగుపల్లె గ్రామాల వరకు గతంలో ఆర్టీసీ బస్సు నడిపారని, ప్రస్తుతం రాకపోకలు నిలిపివేశారని, మళ్లీ బస్సు ప్రారంభించాలని, మల్లవరం మీదుగా కంభంపాడు గ్రామానికి ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లు పొందుగుల వెంకటరెడ్డి, ఎంపీ రమణరెడ్డి, బెజవాడ అదాం కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పోటు కుమారి, ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, ఏఈఈలు రమేష్, రవీంద్రరెడ్డి, ఏఓ బుజ్జిబాయి, ఏపీఓ సాంబశివుడు, ఏపీఎం శ్రీనివాసులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పవన్‌కుమార్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

తాళ్లూరు: ప్రమాదవశాత్తు పాముకాటుకు గురై మృతి చెందిన పవన్‌కుమార్ భౌతిక కాయానికి శనివారం తాళ్లూరు పోలీసులు ఘన నివాళులర్పించారు. పవన్‌కుమార్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఎస్ఐ ప్రేమ్‌కుమార్ నివాళులర్పించారు. ఏఎస్ఐ మోహన్‌రావు, పీసీలు రాములు, మాలకొండయ్య, బ్రహ్మనాయుడు, హెచ్‌జీలు శ్రీను, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నష్ట పరిహారంపై రైతులతో సమావేశం


రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సేథు మాధవన్

పెద్దదోర్నాల: నేషనల్ హైవే భూసేకరణకు నష్ట పరిహారానికి సంబంధించి రైతులతో సబ్ కలెక్టర్ సేథు మాధవన్ శనివారం సమావేశమయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి మండల కేంద్రానికి చెందిన రైతులతో పాటు చిన్నదోర్నాలకు చెందిన రైతులు హాజరయ్యారు. తమ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల జిరాక్స్ కాపీలను అధికారులకు అందజేయాలని సబ్ కలెక్టర్ తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించి భూమి విలువ ఆధారంగా నష్ట పరిహారం అందుతుందని తెలిపారు. తహసీల్దార్ వేణుగోపాలరావు, రిటైర్డు తహసీల్దార్ నాగమల్లికార్జున, ఆయా గ్రామాలకు సంబంధించిన సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటు కోసం దీక్ష


ఎమ్మార్పీఎస్ నాయకులతో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

కంభం: స్థానిక కందులాపురం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం పక్కన జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్పీస్ నాయకుడు పానుగంటి షాలెంరాజు ఆధ్వర్యంలో శనివారం దీక్ష చేపట్టారు. అంబేడ్కర్ భవనానికి స్థలం కేటాయించాలని, మదర్ థెరిసా కాలనీకి రోడ్డు వేయాలని కోరుతూ దీక్ష చేపట్టారు. నిరహార దీక్ష చేపట్టిన ఎమ్మార్పీస్ నాయకులతో మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి, సీఐ భీమానాయక్‌లు చర్చలు జరిపారు. విగ్రహ ఏర్పాటు విషయం ప్రస్తుతం కోర్టులో ఉందని, మిగిలిన సమస్యలు అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సంబంధిత అధికారులతో స్పష్టమైన హామీ వచ్చే వరకూ దీక్ష కొనసాగిస్తామని తెలపడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

కెనరా బ్యాంక్ Canara Bank | చీరాల బ్రాంచ్ (0896) ఆర్ ఆర్ రోడ్డు, చీరాల, ప్రకాశం జిల్లా ఆంధ్రప్రదేశ్. ✆ 08594-232635.

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) (ఇకమీదట ''చట్టం''గా సూచించబడును) ప్రకారం కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి ఋణగ్రహీత/హామీదారు: (1) శ్రీ కారంపూడి మధు, తండ్రి: శ్రీ బాబు రావు, (2) శ్రీ కారంపూడి మురళీ, తండ్రి: హనుమయ్య వారిని నోటీసులో ఉదహరించబడిన తేది. 06.03.2023 నాటికి చెల్లించవలసిన బకాయి సొమ్ము రూ.17,80,546.00/- (అక్షరాల పదిహేడు లక్షల ఎనభై వేల ఐదు వందల నలభై ఆరు రూపాయలు) మొత్తంను సదరు నోటీస్ తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా తేది 06.03.2023 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ ఆస్తిని తేది 03-06-2023న స్వాధీనపరచుకున్నారని తెలియచేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత, హామీదారు మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి కెనరా బ్యాంక్ వారికి తేది. 06.03.2023 నాటికి చెల్లించవలసిన బకాయి సొమ్ము రూ.17,80,546.00/- (అక్షరాల పదిహేడు లక్షల ఎనభై వేల ఐదు వందల నలభై ఆరు రూపాయలు) మరియు వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13(8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

స్థిరాస్తి వివరములు:

శ్రీ కారంపూడి మధు, తండ్రి: శ్రీ బాబు రావు పేరునగల ఆస్తి: ప్రకాశం జిల్లా (పాత), బాపట్ల జిల్లా (కొత్త), వేటపాలెం మండలం, కుందేరు ఒడ్డు, కొత్తపేట గ్రామ పంచాయితీ మరియు గ్రామం, సూర్య టవర్స్ వెనుకవైపు, బ్లాక్ నెం.12, డీ. నెం. 12-142/6, సర్వే నెం.142/13 మరియు 142/14, ప్లాట్ నెం. 6 నందు 178.33 చ॥గ॥ నివాసపు భూమి మరియు అందులోనున్న బిల్డింగ్. హద్దులు: తూర్పు: 20 లింకుల వెడల్పు దారి – 30 అ॥, దక్షిణం: 30 లింకుల వెడల్పు రోడ్డు – 53.06 అ॥, పడమర: నర్రావుల శేఖర్ బాబు స్థలం – 30 అ॥, ఉత్తరం: కంచమూర్తి శ్రీనివాసరావు స్థలం (ప్లాట్ నెం. 7) – 53.06 అ॥.

తేది: 03.06.2023, ప్రదేశం: చీరాల | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్